# మళయాళ చిత్రం

**'పల్లకి' వార పత్రిక**

ఇటూ, అటూ దొంగచూపులు చూస్తూ ఎలాగైతేనేం సినిమాహాల్ గేట్ దగ్గర కొచ్చాడు ఆంజనేయులు. ఏ తెల్సినమొహమూ కనపడకూడదని మొక్కేసు కుంటూ వచ్చాడు మనసులో.

కానీ అతని ఆపదమొక్కు లేవీ ఆ ఆపద మొక్కుల స్వామికి అందకముందే, గేటు దగ్గర కనపడ్డాడు యముడు.

ఆ యముడు ఆంజనేయులికి మామవరస. ఆయన పేరు ధర్మరాజు. 'మామ ధర్మరాజు'కి బదులు 'యమధర్మరాజు' అని ఆయనకి ముద్దుగా పేరు పెట్టుకున్నాడు ఆంజనేయులు.

ఎప్పుడైనా ఆయన బలవంతమ్మీద వాళ్ళింటికి వెళ్ళవల్సివొస్తే యమయాతన అనుభవిస్తాడు ఆంజనేయులు. తన తిరిగొచ్చిన కవితలూ, కథలూ చదివి వినిపిస్తూ ఉంటాడు బలవంతంగా.... వాటిని విన్నందుకు లంచంగా కాఫీ పట్టుకొచ్చి ఇస్తుంది ఆయన భార్య.

ఆయన చదివేవి, వింటుంటే ఎంత ఏడుపొస్తుందో, ఆ దిక్కు మాలిన కాఫీ తాగుతుంటే, ఆ కాఫీ పట్టుకొచ్చే ఆయనగారి భార్య యమదూతలా కనిపించి ....ఇంక యమలోకమంటే ఎక్కడోలేదనిపిస్తుంది ఆంజనేయులికి.

ఆ యముడి కళ్ళల్లో పడనేపడ్డాడు.

వయసు యాభయ్యారయినా ఏమాత్రం దృష్టిదోషం కంటికొచ్చినట్టులేదు. మహాగట్టి ఆరోగ్యం.

సినిమాహాల్‌కి తనొక్కడే సినిమా. చూడటానికొస్తాడన్నట్టు, తక్కిన జనాలు ఎందుకొచ్చారో తనకి తెలియదన్నట్టు "ఏమిటిలా వచ్చావు?" అన్న అర్థంలో కళ్ళెగరేశాడు.

ఇంక తప్పదు... తను సినిమాకోసం రాలేదని, మరో కారణమేదో సృష్టించక తప్పదని పించింది ఆంజనేయులుకి.

"ఇక్కడెక్కడో రామాలయం ఉందని విన్నాను. ఓసారి గుళ్ళోకెళ్ళాలనిపించి బయల్దేరాను" అతికినట్టు అబద్ధమాడేశాడు.

"అలాగా! అదిగో ఆ ఎదురుగా కనిపిస్తోందే చిన్నసందు.. ఆసందులోనే ఉంది చిన్న గుడి... రాములవారి గుడి. 'వెళ్ళిరా."

తనటు వెళ్ళకపోతే ఆయనెక్కడ గమనిస్తాడోనని, ఆయన్ని మనసులో కసితీరా తిట్టుకుంటూ ఆ సందులోకి నడిచాడు, ఓ వెర్రినవ్వు నవ్వి.

వెనక్కి వెనక్కి తిరిగి ఆ యముడివంకే చూస్తూ నడవటంతో కాలుపడింది పేడలో కసి పెరిగింది ఈ లోకమ్మీద. గుడి కెదురుగా నిలబడి, బయటినించే ఓ దండం పారేశాడు.

ఐ.వి.శశి అర్భాటమే మనసులో మెదులుతున్న ఆంజనేయులుకి సీతారామ లక్ష్మణ విగ్రహాలు కంటికి ఆనలేదు.

ఎప్పుడైనా నూటికో కోటికో ఒకసారి అన్నట్టుగా అపురూపంగా, ఆదివారం ఒక్క మార్నింగ్ షో మాత్రమేగా ఏదైనా మళయాళం సినిమా ఆ ఊరొస్తూ వుంటుంది.

ఆంజనేయులుకు మళయాళం సినిమా చూడాలని ఎన్నాళ్ళబట్టో కోరికగా ఉంది. కానీ, ఆ కోరిక తీరే మార్గమే కనబడట్లేదు.

పక్కనున్న పొరుగూరే ఆంజనేయుల్దీ, అతని క్లాస్ మేట్ శంకరానిదీ. చాలా చిన్న పల్లెటూరు వాళ్ళది. కలిసి ఉంటున్నారిద్దరూ.

"ఎక్కడికి వెళ్ళినా ఇద్దరూ కలిసే వెళ్ళండి. ఎప్పుడైనా సరదాకి ఓ సినిమా చూడబుద్ధి వేస్తే మంచి సినిమాకి వెళ్ళండి గానీ, "ఎ" బోర్డున్న సినిమాలకి వెళ్ళబోకండనీ" ఇద్దరి తండ్రులూ స్తోత్రాలు చదివారు అప్పగింతలు పాడేటపుడు.

"ఏవన్నా వెధవ్వేషాలు వేసినట్టు తెల్సిందంటే, వెంటనే చదువు మానించి తీసుకుపోతాం. మనూళ్ళో గేదెల్ని మేపుకుని బతుకుదురు గాని" అంటూ దుర్వాసుడి తాతల్లాశాపాలు కూడా పెట్టారు, అప్పగింతలు పాడి పాడి కలిగిన అలసటవల్ల వచ్చిన విసుగులో పెరిగిన ఆవేశంతో.

మొదటిసారి మళయాళ సినిమాకి బయల్దేరిన రోజు "వొస్తావా" అని శంకరాన్ని అడగక పోలేదు ఆంజనేయులు.

"బాబోయ్! నేను రాను. మా నాన్నకి తెల్సిందంటే....ఎప్పుడూ ఇలాంటి సినిమాలే చూస్తున్నా మనుకుని.. వెంటనే చదువు మానిపించి ఆ పాడు పల్లెటూరు తీసుకుపోయి గేదెల్ని మేపమంటాడు..., మీ నాన్నకి తెల్సినా... నీ పనీ అంతేగా?" అన్నాడు పైగా చివర్న చురక అంటిస్తూ.

"ఎలా తెలుస్తుంది మనవాళ్ళకి?" డబా యించబోయాడు ఆంజనేయులు.

"భలేవాడివే.. ఎలాగోలా తెల్సిపోతుంది. ఈ ఊళ్ళో మీ చుట్టాలూ, మా చుట్టాలూ. వున్నారుగా! అప్పుడప్పుడు మీ నాన్నా, మా నాన్నా ఈ ఊరొస్తూనే ఉన్నారు.... అలా వొచ్చినప్పుడల్లా మన చుట్టాల్ని కల్సుకోందే వెళ్ళట్లేదు. అటువంటప్పుడు ఇదిగో, మీ అబ్బాయి ఇటువంటి సినిమాలు చూస్తున్నాడు. అంటూ ఆ చుట్టపీకలు చెప్పకమానరు. అప్పుడింక నీకూ, నాకూ గేదెల్ని మేపుకోక తప్పదు... మేం చదువుకున్నామా? అయితే మాత్రం మేం బతకట్లేదా? అంటూ ఓ బుర్రకథ పాడేస్తారు.. మన బుఱ్ఱ రామకీర్తన పాడిస్తారు. అక్కడితో కాలేజీ చదువు రమారమణ గోవిందో హరి" నెత్తిన చేతులు జోడించాడు శంకరం.

ఆ మాటలు నిజమేనని ఒప్పుకోక తప్పలేదు ఆంజనేయులుకి. కానీ మళయాళం సినిమా చూడాలన్న కోరికని చంపుకోవడం తనవల్ల కాలేదు.

అందుకే ఊళ్ళో ఆరకం సినిమా మార్నింగ్‌షో వచ్చినప్పుడల్లా.... పాపం... తన ప్రయత్నాలు తను చేస్తూనే ఉన్నాడు...

కానీ, ఫలితం దక్కట్లేదు... చుట్టాలో, తన ఊర్నించి వొచ్చిన శాల్తీలో గేటుదగ్గరే కన బడి, వెర్రి మొహం వేసుకుని వెనక్కి తిరిగి పోవల్సి వస్తోంది.

★★ ★★ ★★

వాల్ పోస్టర్ చూస్తేనే దిమ్మ తిరిగి పోయేలా ఉంది... ఇంక సినిమా? అబ్బా! చూడాలి... చూడాలి.. కలవరించిపోతున్నాడు రాత్రినించీ ఆంజనేయులు, మర్నాడు ఆదివారం రాబోతున్న మార్నింగ్‌షోని తల్చుకుని...

పొద్దున్న తను లేచేటప్పటికే, తయారయి పోయి ఉన్న ఆంజనేయుల్ని చూస్తూనే అర్థమై పోయింది శంకరానికి ఏదో థియేటర్లోకి ఏవోనైట్స్ దిగబడ్డాయని... ఆ వెంటనే గుర్తొచ్చింది నిన్నెవరో "స్మితా బైనైట్స్" అని చెప్పుకున్న సంగతి.

అదసలు మొదట ఇంకేదో పేరుతో రిలీజ్ చేస్తే రెండు రోజుల్లోనే డబ్బాలు తిరిగెళ్ళి పోయాయిట... స్మితకి బాగా పేరొచ్చాక, అదే సినిమాని పేరు మార్చి రిలీజ్ చేసేసరికి బాక్సాపీసు బద్దలు కొట్టిందిట...

అదీ, ఆ సినిమా వెనకాల కథ....

హుషారుగా ఈలవేసుకుంటూ బయల్దేరాడు ఆంజనేయులు. రోడ్డుమీద కొచ్చాడోలేదో ఎదురుపడ్డాడు శ్రీనివాస్. అడగనే అడిగాడు సినిమాకా అని... తల ఊపాడు ఔనని.

"పద నేనూ వొస్తాను" వెంటపడ్డాడు.

"నేనే సినిమాకి వెళ్తే దానికి కళ్ళుమూసుకుని వొస్తావా మరి?"

"కళ్ళుమూసుకుని ఎందుకులే? మూతిపళ్ళు రాలతాయి... కళ్ళు తెరిచే వొస్తాను నడు..." ఏవో కబుర్లు మొదలెట్టాడు నడుస్తూ.

ఈరోజు తప్పకుండా ఆ సినిమా చూడగలనన్న నమ్మకం ఉంది ఆంజనేయులుకి కారణం ఏమిటంటే... ఎప్పుడూ బయలుదేరే టైముకంటే కాస్త లేట్‌గా బయల్దేరాడివాళ... ఎప్పుడూ బాగాముందే థియేటర్ గేటుదగ్గరికి వెళ్ళిపోతూండడం... తెల్సిన మొహాలు కనబడుతూ ఉండటం జరుగుతోంది... అందుకే, సాధ్యమైనంతమటుకు జనాలు లోపలికెళ్ళి పోయి కూచున్నాక గేటుదగ్గిరకి వెళ్ళాలని ప్లాన్...

"అంజనేయులూ...."

పిలుపు వినిపించిన వైపు తల తిప్పాడు.

లెక్చరరు మాణిక్యాలరావు ఇల్లది. ఇంటి బయట నిలబడిఉన్నాడతను. ఆంజనేయులి ఊరే అతని సొంత ఊరు కూడా.

"ఏదయినా పని మీద వెళుతున్నావా ఆంజనేయులూ?"

"ఊర్కెనేకదా బయలుదేరావు. అయితే ఓ చిన్న సాయం చేసిపెడుదూ. ఎవరైనా తెల్సిన కుర్రాళ్ళు కనపడతారా అనే ఇందా కట్నించీ ఇక్కడ నిలబడ్డాను బయట.. మా తమ్ముడు అద్దెకున్న ఇల్లు తెల్సుకదా నీకు?"

"ఆ.. తెల్సండీ."

"ఇప్పుడు వాళ్ళింటికెళ్ళి నేనోసారి మా తమ్ముడిని అర్జంటుగా రమ్మన్నానని చెప్పు నేనే వెళ్ళి మాట్లాడదామంటే పొద్దున్నించీ నాకు జ్వరం. అంత దూరం. వెళ్ళే ఓపికలేదు."

మాణిక్యాలరావు తమ్ముడు మన్మథరావుకి పెళ్ళయి నెల్లాళ్ళయింది. పెళ్ళయాక, తన ఆఫీసుకి దగ్గర్లో ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం పెట్టాడు.

"అలాగే... ఇప్పుడేవెళ్ళి చెప్తానండీ" ఎంతో వినయంగా చెప్పాడు ఆంజనేయులు.

ఏ మళయాళ మాంత్రికుడైనా ఈ మాణిక్యాల రావుని ఎత్తుకు పోకూడదా అనుకున్నాడు కోపంగా మనసులో.

అయిపోయింది...నా పని గోవిందా!... నీకు నేనే దొరికానా, నాయనా!... ఇక్కడుందా, నీ తమ్ముడిల్లు... అంత దూరం నేవెళ్ళి వొచ్చేసరికి ఐ.వి.శశి టెక్నిక్ కాస్తా అయ్యేపోతుంది. తెరమీద...

ఏడుపొక్కటే తక్కువగా, ఉసూరుమంటూ, కాళ్ళీడ్చుకుంటూ ముందుకి కదిలాడు.

"ఇదిగో... అంజనేయులూ... ఒక్క సారి అగు.. ఒకవేళ మా తమ్ముడూ వాళ్ళు బయటికెక్కడికైనా వెళ్ళి ఉంటే అసలు కబురైనా తెలుస్తుంది... ఓ చీటీ రాసిస్తాను.. అది ఏ కిటికీలోంచో ఇంట్లో పడేసి వొచ్చెయ్యి... ఇంటి కొచ్చాక ఆ చీటి చూసుకునైనా, వెంటనే నా దగ్గిర కొస్తాడు."

గబగబా లోపలికెళ్ళి ఓ చీటి రాసి పట్టుకొచ్చి, అంజనేయులి చేతిలో పెట్టాడు.

ఆ ఆంజనేయస్వామి సంజీవి పర్వతాన్ని అతితేలిగ్గా మోశాడట... కానీ, ఈ ఆంజనేయులికి, ఈ చిన్న కాగితమ్ముక్కే కొండంత బరువుగా తోచింది కోపంలో.

మన్మథరావు ఇంటి తలుపులు వేసి ఉన్నాయి. చిన్నగా తట్టాడు ఎవరూ పలక లేదు. మళ్ళీ సారి తట్టలేదు... కొట్టాడు... ఉహూ... ఒదల్లేదు.... మళ్ళీకొట్టాడు.

"అయనింట్లో ఉండి ఉండరు... వాళ్ళావిడ నిద్రపోతూ ఉండి ఉంటుంది. ఇంక నువ్వెంత సేపు తలుపు కొట్టినా అంతే సంగతులు... లెక్చరర్‌గారు రాసిచ్చిన చీటీ ఉందిగా. అదిగో ఆ కిటికీ లోంచి చీటీ పడేసి వొచ్చెయ్యి... నిద్ర లేచాక ఆవిడే చూసుకుంటుంది" సలహా ఇచ్చాడు శ్రీనివాస్.

మాణిక్యాలరావు మీద మండిపడిపోతున్న అంజనేయులికి ఈ సలహా నచ్చింది. కిటికీ దగ్గిర కెళ్ళాడు.

బాగా కాళ్ళెత్తితే గానీ ఆ కిటికీ లోంచి లోపలంతా కనబడదు. ఇల్లు ఎత్తు మీదుంది.. కాళ్ళెత్తి కిటికీలోంచి చూస్తూ, జేబులో చెయ్యి పెట్టాడు చీటీ తియ్యడానికి.

అంతే... షాక్ కొట్టినట్టయింది....ఎలా వొచ్చిపడ్డాడో రోడ్డుమీదికి తనకే తెలియదు.

"ఏవిట్రా? ఏవైంది? అలా అయిపోయిందేవిటి నీ మొహం!" అంటూ కంగారుగా శ్రీనివాస్ ఎన్నిప్రశ్నలు వేసినా ఆంజనేయులు నోట్లొంచి మాటే రాలేదు.

అదోరకం అవస్థలో రూమ్ కొచ్చి పడ్డాడు.

"వెళ్ళావా సినిమాకి?" స్నేహితుడు గదిలో అడుగు పెడుతుండగానే అడిగాడు శంకరం.

"వెళ్ళలేదు." అప్పటికొచ్చింది ఆంజనేయులు నోట్లోంచి మాట.

"అయ్యో! పాపం! అయితే చూడలేదన్న మాట నీ మళయాళ సినిమా..." ఒక్కొక్క మాటా వొత్తి పలుకుతూ వేళాకోళంగా అన్నాడు.

"చూశాను" ఎటో చూస్తూ జవాబిచ్చాడు.

ఇదేమిటి? సినిమాకి వెళ్ళలేదన్నాడు.. మళ్ళీ చూశానంటున్నాడు వీడికేదో ఎండలో పైత్యం తలకెక్కినట్టుంది, నా మతి పొగొడుతున్నాడు. ఏమీ అర్థం కాలేదు శంకరానికి.

అయోమయంగా చూస్తూ అడిగాడు "ఏమి చూశావు?"

తెరచి ఉన్న, మన్మథరావు ఇంటి కిటికీ తలుపులు ఒకసారి టకటకా కొట్టుకున్నాయి ఆంజనేయులి గుండెల్లో.

టక్కున జవాబిచ్చాడు "మళయాళచిత్రం చూశాను."

★★ ★★ ★★